
సాక్షి
జయశంకర్ భూపాలపల్లి

శనివారం | 12 | అక్టోబర్ | 2024



సిద్ధిదా అలంకరణలో అమ్మవార్లు

కాళేశ్వరం: శ్రీదేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి దేవస్థానం అనుబంధ ఆలయాల్లోని శ్రీశుభానందదేవి, శ్రీసరస్వతీ అమ్మవార్లు తొమ్మిదవ రోజు సిద్ధిదా అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శుక్రవారం అమ్మవార్లకు అర్చకుడు త్రిపురారి కృష్ణమూర్తిశర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. పూలదండలు, పట్టువస్త్రాలతో అలంకరించి ముస్తాబు చేశారు. పూజల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయంలోని శ్రీదుర్గాదేవి అమ్మవారికి పూజలు చేశారు.

సిద్ధిదా అలంకరణలో శ్రీశుభానందదేవి అమ్మవారు



సిద్ధిదా అలంకరణలో శ్రీసరస్వతీ అమ్మవారు

న్యూస్‌రీల్

పంటల సందర్శన



చిట్యాల: మండలంలోని గుంటూరుపల్లి, జూకల్, ఒడితల, జడల్‌పేట, రాంచంద్రాపూర్ గ్రామాలలో ఆయిల్ పామ్ తోటలను జిల్లా ఉద్యాన శాఖ అధికారి సంజీవరావు శుక్రవారం సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యాజమాన్య పద్ధతులు పాటించాలని రైతులకు సూచించారు. అంతర(కూరగాయాలు) పంటలు కూడా సాగు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఆయన వెంట సువేన్ ప్రతినిధులు అరవింద్, సాయి, రైతులు కొంక హన్మంతరావు, కుర్మిళ్ల కుమారస్వామి పాల్గొన్నారు.

14న ఉమ్మడి జిల్లా స్థాయి రెజ్లింగ్ ఎంపికలు

వరంగల్ స్పోర్ట్స్: ఈనెల 14న ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి అండర్–19 బాలుర రెజ్లింగ్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు హనుమకొండ డీవైఎస్‌ఓ గుగులోతు అశోక్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఉదయం 10 గంటలకు నిర్వహించే ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు ఒరిజినల్ జనన ధ్రువీకరణ, స్టడీ సర్టిఫికెట్లతో హాజరు కావాలని పేర్కొన్నారు. ఇందులో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను ఈనెల 15వ తేదీ నుంచి హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు పీఈటీ తోట శ్యాం ప్రసాద్‌ను 98492 10746 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

అన్‌మ్యాన్డ్ డిస్ట్రిబ్యూషన్ వర్కర్ల వేతనాలు పెంపు

హన్మకొండ: విద్యుత్ అన్‌మ్యాన్డ్ డిస్ట్రిబ్యూషన్ వర్కర్ల వేతనాల పెంపునకు టీజీ ఎన్పీడీసీఎల్ యాజమాన్యం అంగీకరించినట్లు ఐఎన్‌టీయూసీ తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (టీఎస్‌ఈఈయూ)–327 రాష్ట్ర సెక్రటరీ జనరల్ తెలిపారు. అన్‌మ్యాన్డ్ డిస్ట్రిబ్యూషన్ వర్కర్లకు స్కిల్డ్ వేతనాలు చెల్లించాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డికి వినతిపత్రం అందించామని పేర్కొన్నారు. ఈ అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. తమ యూనియన్ వినతి పత్రానికి స్పందించిన కాంగ్రెస్ ప్రభుత్వం అన్‌మ్యాన్డ్ డిస్ట్రిబ్యూషన్ స్కిల్డ్ వర్కర్లకు స్కిల్డ్ వేతనం రూ.17,598 ఇచ్చేందుకు అంగీకరించిందని పేర్కొన్నారు.

యాగ పూర్ణాహుతి



హన్మకొండ కల్చరల్ : వరంగల్ భద్రకాళి దేవాలయంలో నిర్వహిస్తున్న అమ్మవారి శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా తొమ్మిదవ రోజు గురువారం ఉత్సవాల యాగ పూర్ణాహుతి నిర్వహించారు. అర్చకులు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో వేదపండితులు అమ్మవారి మూలమూర్తికి ఉదయం పూర్ణాభిషేకం, చతుస్థానార్చలు నిర్వహించారు.

విజయదశమి శుభాకాంక్షలు



భూపాలపల్లి రూరల్: జిల్లా ప్రజలందరికీ కలెక్టర్ రాహుల్ శర్మ శుక్రవారం ఒక ప్రకటనలో విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. దుర్గామాత ఆశీస్సులు ఎల్లవేళలా జిల్లా ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. దసరా పండుగ ప్రజలందరి జీవితాల్లో ఆనందం, సంతోషం సుఖశాంతులు తీసుకురావాలన్నారు. తొమ్మిది రోజుల పాటు ఆడబిడ్డలు వివిధ రకాల పూలను బతుకమ్మలుగా పేర్చి ఆట, పాటలు, కోలాటాలతో సంప్రదాయాలు, ఆచారాలను పాటిస్తూ ఎంతో వైభవంగా జరుపుకున్నారని తెలిపారు. అమ్మవారి ఆశీస్సులతో అభివృద్ధిలో జిల్లా అగ్రగామిగా నిలవాలని ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు కలెక్టర్ తెలిపారు.



విజయీభవ!

నేడు విజయదశమి వేడుకలు

- జమ్మి, ఆయుధ పూజలు
- అంబేడ్కర్ స్టేడియంలో సాంస్కృతిక కార్యక్రమాలు
- జిల్లావ్యాప్తంగా రావణవధకు ఏర్పాట్లు



వేడుకలకు సిద్ధంచేసిన దుర్గామాత ఆలయం



అంబేడ్కర్ స్టేడియంలో కార్యక్రమానికి ఏర్పాట్లు

భూపాలపల్లి అర్బన్: సర్వ శక్తిమయం, ముల్లోకాలకు జననిగా, బ్రహ్మ, విష్ణు, మహేశ్వరాది సకల దేవగణమంతా సమస్కరించే ఆదిశక్తిని నవ రాత్రులు పూజిస్తూ, వివిధ అలంకరణలతో కొలుస్తూ.. చివరిరోజు విజయానికి చిహ్నంగా వేడుక జరుపుకునేదే దసరా. మహిషాసురుడితో ఆదిపరాశక్తి తొమ్మిది రోజులు పోరాడి విజయం సాధించిన రోజును విజయదశమిగా వేడుక చేసుకుంటాం. సద్దుల పండగ సంబురంగా జరుపుకున్న తరువాత.. చేసే ప్రతీపనిలో విజయం సాధించాలని అమ్మవారిని వేడుకుంటూ.. జరుపుకునేదే దసరా. జిల్లా ప్రజలు నేటి దసరా వేడుకలకు సిద్ధమయ్యారు. జిల్లాకేంద్రంలోని అంబేడ్కర్ స్టేడియంతో పాటు జిల్లా వ్యాప్తంగా ప్రధాన ఆలయాలతో పాటు పలు మైదానాల్లో ఏర్పాట్లు చేశారు.

ప్రత్యేక పూజలు

దసరాను పురస్కరించుకొని జిల్లాకేంద్రంతో పాటు గ్రామాల్లో వేడుకలను ఘనంగా నిర్వహించుకోనున్నారు. ప్రతీ గ్రామంలో గ్రామ దేవతైన భూలక్ష్మి వద్ద జంతుబలి కార్యక్రమం నిర్వహించిన అనంతరం గ్రామ చివరికి వెళ్లి పాలపిట్టను చూస్తారు. జమ్మి చెట్లను ఏర్పాట్లు చేసి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. రావణాసురుడి బొమ్మలు ఏర్పాటు చేసి దహనం చేయనున్నారు. పోలీస్‌స్టేషన్‌లలో ఆయుధ పూజ నిర్వహించనున్నారు.

సాంస్కృతిక కార్యక్రమాలు

జిల్లాకేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో దసరా వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. భూపాలపల్లి మున్సిపాలిటీ, సింగరేణి, దసరా ఉత్సవ సమితిల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. సుమారు 40 ఫీట్ల పొడవైన రావణాసుర బొమ్మను ఏర్పాటు చేశారు. నేడు (శనివారం) సాయంత్రం ప్రముఖ గాయకులు, మిమిక్రీ ఆర్టిస్టులు, కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథులుగా కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, ఎస్పీ కిరణ్‌ఖరే, మున్సిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణి హాజరుకానున్నారు. ఈ కార్యక్రమ ఏర్పాట్లను చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణిసిద్దు, కమిషనర్ రాజేశ్వర్ శుక్రవారం పరిశీలించారు.

చెడుపై విజయానికి చిహ్నం

- ఎస్పీ కిరణ్ ఖరే



ఆయుధ పూజ చేస్తున్న ఎస్పీ కిరణ్ ఖరే దంపతులు

భూపాలపల్లి రూరల్: చెడుపై మంచి సాధించిన విజయానికి చిహ్నంగా విజయదశమి పండుగను జరుపుకుంటారని ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. దసరా పండుగను పురస్కరించుకొని శుక్రవారం జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వు ప్రధాన కార్యాలయంలో ఎస్పీ కిరణ్ ఖరే దంపతులు ఆయుధాలు, వాహనాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడారు. సమాజంలో చెడును పారదోలేందుకు పోలీస్ విభాగం నిరంతరం కృషి చేస్తోందన్నారు. పోలీసులకు ఆయుధాలతో ప్రత్యేక అనుబంధం ఉంటుందని చెప్పారు. పోలీసు వ్యవస్థలో ప్రతీవ్యక్తి ఆయుధాన్ని గౌరవిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాల్సిన అవసరం ఉందని గుర్తుచేశారు. మనిషిని సురక్షితంగా గమ్యస్థానాలకు చేరవేసే వాహనాలకు అంతే ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు. ప్రతీఏటా విజయదశమి సందర్భంగా ఆయుధ, వాహనపూజ ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిరంతరం ప్రజాసేవలో ఉండే పోలీసులకు దుర్గాదేవి అనుగ్రహంతో విజయం వరించాలని ఆకాంక్షించారు. జిల్లా ప్రజలకు, పోలీస్ అధికారులు, సిబ్బందికి, దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు, ఎస్సైలు, నరేష్‌కుమార్, వసంత్ కుమార్, నగేష్, కిరణ్, రత్నం, శ్రీకాంత్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మత్తు పదార్థాల నిర్మూలనలో..

జిల్లాలో గంజాయి, మత్తు పదార్థాల నిర్మూలనలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని ఎస్పీ కిరణ్ ఖరే శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గంజాయి, డ్రగ్స్, రహిత జిల్లాగా మార్చాలన్న సంకల్పంతో జిల్లా పోలీస్ శాఖ పనిచేస్తుందన్నారు. జిల్లాలో గంజాయి రవాణాపై స్పెషల్ డ్రైవ్‌లు, నార్కోటిక్ జాగిలాలతో తనిఖీలు చేపడుతూ గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నామని చెప్పారు. గంజాయి సేవించే, రవాణా చేస్తున్న వారిపై కేసులు నమోదు చేస్తున్నామన్నారు. గతంలో గంజాయి కేసులలో నిందితులుగా ఉన్న వారికి వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ నిర్వహించడంతో పాటు అవగాహన కల్పిస్తున్నామన్నారు. జిల్లాలో గంజాయి విక్రయించిన, సాగు చేసిన, సేవించిన, రవాణా చేసిన వారి సమాచారం తెలపాలని సూచించారు. ఇప్పటికే గంజాయి, డ్రగ్స్‌కు అలవాటుపడి ఇబ్బందులు ఎదుర్కొంటే వెంటనే జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఏర్పాటుచేసిన డిఅడిక్షన్ సెంటర్‌కు తరలించాలని సూచించారు. మంచి వైద్యబృందంతో పాటు అన్ని రకాల సౌకర్యాలు కల్పించినట్లు చెప్పారు. జిల్లాలో మత్తుకు బానిస అయి ఇబ్బంది పెడుతున్న వారి వివరాలు పోలీసులకు తెలపాలని చెప్పారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

పూర్ణాహుతి

కాళేశ్వరం: శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయం అనుబంధ దేవాలయాల్లోని శ్రీశుభానందదేవి, శ్రీమహాసరస్వతీ అమ్మవార్లు శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొమ్మిది రోజుల పాటు వివిధ అలంకరణలో దర్శనమిస్తున్నారు. శుక్రవారం ఆలయ యాగశాలలో పూర్ణాహుతి కార్యక్రమాన్ని అర్చకులు త్రిపురారి కృష్ణమూర్తిశర్మ, పనకంటి ఫణీంద్రశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. రాజశ్యామలార్చన, లలిత సహస్రనామార్చన, మూలమంత్ర చండీహోమం, పూర్ణాహుతి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ వసంత పాల్గొన్నారు.



పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అర్చకులు



పూజలో పాల్గొన్న భక్తులు

సింగరేణిని లాభాల్లోకి తీసుకెళ్లాలి

- భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి అర్బన్: కార్మికులు మరింత శ్రమించి సింగరేణి సంస్థను ముందుకు తీసుకెళ్లాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు కోరారు. సింగరేణి యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం ఉజ్వల సింగరేణి –ఉద్యోగుల పాత్ర కార్యక్రమం నిర్వహించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సందేశాలను కార్మికులకు వినిపించారు. అనంతరం ఏరియాలో సింగరేణి అధికారులు కార్మికులకు నిర్వహించిన సహపంక్తి భోజనాల కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పాల్గొని కార్మికులతో కలిసి భోజనాలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గడిచిన ఆర్థిక సంవత్సరంలో సింగరేణి సాధించిన లాభాల్లో నుంచి కార్మికులకు 33శాతం వాటా ఇచ్చినట్లు చెప్పారు. రానున్న రోజుల్లో కూడా బొగ్గు ఉత్పత్తిని కార్మికులు మరింత పెంచి సంస్థను లాభాల్లోకి తీసుకువెళ్లే విధంగా రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే ఎంపీ, ఎమ్మెల్యేలు నేరుగా కార్మికులను కలిసి వారి సమస్యలను, సూచనలు, సలహాలు తెలుసుకోవాలని ముఖ్యమంత్రి సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్మికులు రక్తాన్ని చెమటగా మార్చి బొగ్గు ఉత్పత్తి చేస్తున్నారని చెప్పారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కదిలించినట్లు గుర్తుచేశారు. సింగరేణి కార్మికుల సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. సింగరేణి ఏరియా ఆస్పత్రుల్లో సీటి స్కానింగ్ మిషన్లు ఏర్పాటు చేశామన్నారు. సీఎస్‌ఆర్ నిధులతో ఎంఆర్‌ఐ మిషన్లు ఏర్పాటు చేయాలని, ఆస్పత్రిల్లో సూపర్‌స్పెషాలిటీ వైద్యసేవలు అందించాలని, స్పెషలిస్టు డాక్టర్లను నియమించాలని ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యాన్ని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరియా జీఎం హబీబ్‌హుస్సేన్, ఎస్‌వోటు జీఎం కవీంద్ర, కార్మిక సంఘాల నాయకులు బుచ్చయ్య, రమేష్, అధికారులు, కార్మికులు మారుతి, అశోక్, దేవన్, కొమురయ్య, కిషన్, సాంబమూర్తి పాల్గొన్నారు.

వీరుల గాథలు తెలుసుకునేలా..

- విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పోటీలు
- మూడో తరగతి నుంచి ఇంటర్ విద్యార్థులకు..
- 15నాటికి ఆన్‌లైన్‌లో నమోదుకు అవకాశం
- 17నుంచి జిల్లాస్థాయి పోటీలు ప్రారంభం



వీర్ గాథ వెబ్‌పేజీ

భూపాలపల్లి అర్బన్: విద్యార్థి స్థాయి నుంచే దేశభక్తిని పెంపొందించడానికి దేశంకోసం ప్రాణాలర్పించిన వీరుల గాథలు తెలియజేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక పోటీలను నిర్వహిస్తోంది. మూడో తరగతి నుంచి ఇంటర్ విద్యార్థుల వరకు ఈ పోటీలు నిర్వహించనున్నారు.

3వ తరగతి నుంచి..

జిల్లావ్యాప్తంగా 400కి పైగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, 30కి పైగా జూనియర్ కళాశాలలు ఉన్నాయి. 3వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న విదార్థులు పోటీలలో పాల్గొనవచ్చు. ఈనెల 15వ తేదీ నాటికి సంబంధిత పోర్టల్‌లో వివరాలు నమోదు చేయాలి. 17నుంచి నవంబరు 10వరకు జిల్లాస్థాయి, నవంబరు 12నుంచి 30వ తేదీ వరకు రాష్ట్ర స్థాయి, డిసెంబరు 4వ తేదీ నుంచి 24వరకు జాతీయ స్థాయి పోటీలు ఉంటాయి. ఆసక్తి ఉన్న విద్యార్థులు మైగొ.ఇన్ వెబ్‌సైట్‌లో వీర్ గాథా ఆప్షన్ క్లిక్ చేసి వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. రక్షణ, విద్యా మంత్రిత్వ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో 2024–25 సంవత్సరానికి 'వీర్ గాథ- 4.0' పేరుతో వీటిని నిర్వహిస్తోంది. ఈ మేరకు ఇప్పటికే ఆయా జిల్లాల విద్యాశాఖ అధికా రులకు ఆదేశాలు జారీ చేయడంతో పాటు వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహించి సూచనలు చేశారు.

సూపర్ 100 విజేతలు..

వీర్ గాథ పోటీలో ఒక స్థాయిలో ఎంపికైన వారిని, మరో స్థాయిలో ఎంపిక చేయకుండా వేర్వేరు విద్యార్థులను ఎంపిక చేస్తారు. జిల్లా స్థాయి పోటీలలో నలుగురిని విజేతలుగా, రాష్ట్ర స్థాయి పోటీలలో 8 మందిని విజేతలుగా గుర్తిస్తారు. ఇక జాతీయ స్థాయి పోటీలలో 100 మందిని విజేతలుగా ప్రకటిస్తారు. వీరిని సూపర్–100 విజేతలుగా పిలుస్తారు. 3వ తరగతి నుంచి 5 వరకు 25 మంది, 6వ తరగతి నుంచి 8 వరకు 25 మంది, 9, 10వ తరగతి నుంచి 25 మంది, ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరం నుంచి 25 మందిని ఎంపిక చేస్తారు. జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలలో సత్కారం, ధ్రువపత్రం అందిస్తారు. జాతీయస్థాయి విజేతలకు విద్యా మంత్రిత్వ శాఖ, రక్షణ మంత్రిత్వ శాఖ రూ.10వేల చొప్పున నగదు అందజేస్తుంది.

తరగతుల వారీగా..

- 3వ తరగతి నుంచి 5వ తరగతి విద్యార్థులు 150 పదాలకు మించకుండా 'నా రోల్ మోడల్' అనే పేరుతో గ్యాలెంట్రీ అవార్డు పొందిన దేశభక్తుని గురించి అంశంపై వ్యాసం లేదా డ్రాయింగ్ వేయాల్సి ఉంటుంది.
- 6వ తరగతి నుంచి 8వ తరగతి విద్యార్థులు గ్యాలెంట్రీ అవార్డు పొందిన వారు దేశం కోసం చేసిన త్యాగం గురించి వివరిస్తూ.. 300 పదాలకు మించకుండా వ్యాసం లేదా డ్రాయింగ్ లేదా మల్టీ మీడియా ప్రదర్శన ఇవ్వాలి. 9వ తరగతి నుంచి 10వ తరగతి వారు 'రాణీ లక్ష్మీ బాయి కలలోకి వస్తే.. నీవు దేశసేవ ఎలా చేస్తావు' అనే అంశంపై 750 పదాల వ్యాసం లేదా డ్రాయింగ్, మల్టీమీడియా ప్రదర్శన పోటీలో పాల్గొనవచ్చు. ఇంటర్ విద్యార్థులు స్వాతంత్ర్య ఉద్యమంలో 1857 తిరుగుబాటులో నిన్ను ప్రేరేపించిన అంశంపై వెయ్యి పదాల వ్యాసం, చిత్ర లేఖనం ద్వారా పోటీలో పాల్గొనవచ్చు.

ప్రతీ విద్యార్థి పాల్గొనేలా..



పోటీల కోసం వీలైనంత వరకు ఎక్కువ పాఠశాలల నుంచి ప్రతీ విద్యార్థి పాల్గొనేలా చూస్తున్నాం. ఇప్పటికే అన్ని పాఠశాలలకు సమాచారం అందించాం. దసరా సెలవుల కారణంగా కొంత ఇబ్బంది ఏర్పడింది. పాఠశాలలు ప్రారంభం కాగానే నమోదు జరిగేలా చూస్తాం. దరఖాస్తుల గడువు పొడిగించే అవకాశం ఉంటుంది.

\- కాగిత లక్ష్మణ్, ఏఎంఓ

మహిషాసురమర్దినిగా రుద్రేశ్వరీ

హన్మకొండ కల్చరల్ : హనుమకొండలోని రుద్రేశ్వరస్వామి వారి వేయిస్తంభాల దేవాలయంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా తొమ్మిదవ రోజు శుక్రవారం అమ్మవారిని మహిషాసురమర్దినిగా అలంకరించి పూజలు నిర్వహించారు. ప్రధానార్చకులు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో స్వామి వారికి రుద్రాభిషేకాలు, రుద్రార్చనలు నిర్వహించారు. అమ్మవారిని మహిషాసురమర్దినిగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఉత్సవమూర్తికి పల్లకీసేవ నిర్వహించారు.

అత్యాధునిక వసతులతో ఉన్నత విద్య

- ప్రతీ నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్స్
- వరంగల్ ఎంపీ కడియం కావ్య



శంకుస్థాపన చేస్తున్న ఎంపీ కావ్య, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

గణపురం: అత్యాధునిక వసతులతో ప్రతీ నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేయడం ద్వారా విద్యార్థులకు కార్పొరేట్ విద్య అందుబాటులోకి వస్తుందని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. గణపురం మండలం మైలారం గ్రామంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలను శుక్రవారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ కావ్య మాట్లాడుతూ ఇంటిగ్రేటెడ్ పాఠశాలల కాంప్లెక్స్ బాలికలకు విద్యతో పాటు ఎంతో సెక్యూరిటీని అందిస్తుందన్నారు. నాలుగో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఉంటుందని చెప్పారు. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో పాఠశాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలకు రావాలని ప్రభుత్వం అన్ని హంగులతో నిర్మాణం చేపడుతుందన్నారు. పాఠశాలలో క్రీడాప్రాంగణాలు, లైబ్రరీ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. పాఠశాలలో 2,568మంది విద్యార్థులు 128మంది ఉపాధ్యాయులు ఉంటారని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగాలు భర్తీ చేయలేదని, తాము డీఎస్సీ నోటిఫికేషన్ వేయడంతో పాటు పదివేల ఉపాధ్యాయ ఉద్యోగాలు ఇవ్వడం పెద్ద సాహసమన్నారు. నియోజక అభివృద్ధికి కేంద్రం నుంచి ప్రత్యేక నిధులు తీసుకువస్తానని తెలిపారు. నియోజకవర్గంలో జాతీయ రహదారుల నిర్మాణానికి కేంద్ర జాతీయ రహదారుల అధికారులతో మాట్లాడి నాలుగు వరుస రోడ్ల నిర్మాణానికి రూ.660 కోట్ల మంజూరుకు ఉత్తర్వులు జారీచేసినట్లు చెప్పారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. భూపాలపల్లి నియోజకవర్గంలో ఖనిజ సంపద, అటవీ సంపదతో పాటు సింగరేణి గనులు, జెన్‌కో విద్యుత్ కేంద్రాలు ఉన్నాయన్నారు. గణపేశ్వరాలయం, గణపసముద్రం చెరువు, పాండవుల గుట్ట, బుగులోని వెంకటేశ్వరస్వామి, కోటంచ తదితర పర్యాటక ప్రాంతాలు, పుణ్యక్షేత్రాలు ఉన్నాయని చెప్పారు. వాటి అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేస్తామన్నారు. ఈ ప్రాంతాన్ని ఇండస్ట్రీయల్ కారిడార్‌గా అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. నవంబర్‌లో జరుగనున్న పార్లమెంట్ సమావేశాలలో ఈ అంశాలపై కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు.

అంతర్జాతీయ ప్రమాణాలతో..

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలను రూ.176 కోట్లతో నిర్మించనున్నట్లు తెలిపారు. ప్రశాంతమైన వాతావరణంలో పాఠశాల నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ 4వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు అంతర్జాతీయ ప్రమాణాలతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌లో విద్యాబోధన జరుగుతుందన్నారు. 40 ఎకరాలలో స్కూల్ నిర్మాణంతో పాటు డిజిటల్ స్మార్ట్ బోర్డులు, కంప్యూటర్ సెంటర్లు, లైబ్రరీలు, క్రీడా మైదానం తదితర సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



అపరిష్కృత సమస్యల పరిష్కారానికి కృషి

● ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

విద్యారణ్యపురి: విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలపై శాసనమండలిలో తాను లేవనెత్తానని, మరోసారి ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఎన్నికల బరిలో ఉండబోతున్నానని ఇప్పటివరకు పరిష్కారం కాని సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని ఉమ్మడి వరంగల్, నల్గొండ, ఖమ్మం జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. హనుమకొండలోని టీఎస్‌యూటీఎఫ్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతల కల్పనకు కృషిచేసినట్లు చెప్పారు. రెసిడెన్షియల్ స్కూల్స్‌లో టైంటేబుల్ మార్పు, కేర్‌టేకర్ల నియామకం, కేజీబీవీ సిబ్బంది రెగ్యులరైజేషన్, కనీస వేతనాలు, మోడల్ స్కూల్స్ ఉపాధ్యాయుల పదోన్నతులు, ప్రాథమిక పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయుల పోస్టుల మంజూరి కోసం కృషి చేస్తానన్నారు. తాను ఏపార్టీకి కూడా తొత్తుగా వ్యవహరించబోనని స్పష్టం చేశారు. వచ్చే ఏడాది మార్చిలో నిర్వహించబోయే వరంగల్, నల్గొండ, ఖమ్మం జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీఎస్‌యూటీఎఫ్ అభ్యర్థిగా పోటీచేయబోతున్నట్లు తెలిపారు. సమావేశంలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావా రవి, టీఎస్‌యూటీఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రాజు, రాష్ట్ర కార్యదర్శి సో మశేఖర్, రంజిత్‌కుమార్, మల్లారెడ్డి, పెండెం రాజు, కుమార్, కిరణ్‌కుమార్, సుజన్ ప్రసాద్‌రావు, మురళీకృష్ణ, చంద్రశేఖర్‌రావు, వాసుదేవరెడ్డి, దామోదర్, మల్లిక్ పాల్గొన్నారు.

నర్సిరెడ్డికి వివిధసంఘాల మద్దతు

ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉపాధ్యాయ శాసన మండలికి ఉపాధ్యాయ, అధ్యాపకసంఘాల మద్దతుతో టీఎస్ యూటీఎఫ్ అభ్యర్థిగా అలుగుబెల్లి నర్సిరెడ్డి తిరిగి పోటీ చేయనున్నట్లు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి వెల్లడించారు. శుక్రవారం హనుమకొండలోని టీఎస్‌యూటీఎఫ్ భవన్‌లో వివిధ సంఘాల బాధ్యులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ నర్సిరెడ్డి అభ్యర్థిత్వాన్ని ఏకగ్రీవంగా నిర్ణయించినట్లు తెలియజేశారు. సమావేశంలో తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్ల అసోసియేషన్ అధ్యక్షుడు వస్కుల శ్రీనివాస్, కొప్పిశెట్టి, సురేశ్, తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్టు లెక్చరర్ల అసోసియేషన్ డాక్టర్ శ్రీధర్‌కుమార్‌లోథ్, ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ బాధ్యులు ఆస్నాల శ్రీనివాస్, కొండయ్య, మహేశ్, సంజీవయ్య, విజయ్‌మోహన్, హరగోపాల్, రాజిరెడ్డి, రవీందర్, సుధాకర్, రవీందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో ఓ వ్యక్తి మృతి



హుస్సేన్ మృతదేహం

ఖిలా వరంగల్: పడమరకోట ఎస్సీ వాడకు చెందిన ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం కలకలం రేపింది. మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ శివనగర్‌లోని భూపేష్‌నగర్ చెందిన ఎండీ హుస్సేన్(32) ఖిలా వరంగల్ పడమరకోటకు చెందిన మంద సంధ్యారాణిని 12 ఏళ్ల క్రితం కులాంతర వివాహం చేసుకుని.. భవన నిర్మాణ కార్మికుడిగా సెంట్రింగ్ పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గురువారం రాత్రి కుటుంబ సభ్యులు సద్దుల బతుకమ్మ ఆడుకునేందుకు వెళ్లగా హుస్సేన్ తన స్నేహితుడైన పడమరకోట పద్మశాలి వీధికి చెందిన గూడూరు శివ వద్దకు వెళ్లాడు. రాత్రి 10గంటల సమయాన హుస్సేన్ సొమ్మసిల్లిపడిపోయి ఉన్నాడని గూడూరు శివ హుస్సేన్ భార్యకు సమాచారం ఇచ్చాడు. సంధ్యారాణి, శివ కలిసి అతడి ఆటోలోనే హుస్సేన్‌ను ఇంటికి తీసుకొస్తారు. కానీ అప్పటికే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. స్నేహితుడిపై అనుమానం ఉందని మృతుడి భార్య, బంధువులు ఆరోపించారు. మృతుడి భార్య సంధ్యారాణి ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

16 నుంచి మణుగూరు బెల్గావి రైలు ప్రారంభం



దోర్నకల్: బెల్గావి మణుగూరు స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైలు ఈ నెల 16 నుంచి పునఃప్రారంభం కానుంది. పండుగ సమయాల్లో ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని సుమారు నాలుగు నెలల క్రితం రద్దయిన ఈ ఎక్స్‌ప్రెస్‌ను 16వ తేదీ నుంచి వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ వరకు నడపనున్నారు. వారానికి నాలుగు రోజులు నడిచే ఈ రైలు బెల్గావి నుంచి మణుగూరుకు(07335) ఆది, సోమ, బుధ, గురువారాల్లో, మణుగూరు నుంచి బెల్గావి(07336) ఆది, బుధ, గురు, శనివారాల్లో నడవనుంది. బెల్గావి రైలు సర్వీసును పునరుద్ధరించాలని కోరుతూ తాము ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు రఘు రామిరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన జీఎం అరుణ్‌కుమార్‌ను కలిసి రైలును పునరుద్ధరించేందుకు కృషి చేశారని డీఆర్‌యూసీసీ మాజీ సభ్యుడు మైనుపాషా తెలిపారు.

క్రీడాకారిణికి ఆర్థిక సాయం



చెక్కు అందజేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

పలిమెల : అంతర్జాతీయ పారా అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన మండల కేంద్రానికి కావేరి జ్యోతికి రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయం ప్రకటించింది. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు చేతుల మీదుగా రూ.1.19 లక్షల చెక్కును కావేరి జ్యోతికి అందజేశారు. ఈ నెల 4వ తేదీన సాక్షిలో ప్రచురితమైన 'కాలు కోల్పోయినా.. కఠోర సాధనతో ముందుకు' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందనగా రాష్ట్ర ప్రభుత్వం కావేరి జ్యోతికి ఆర్థిక సాయాన్ని అందజేసింది. ఈ సందర్భంగా కావేరి జ్యోతి, తల్లిదండ్రులు కావేరి బుచ్చయ్య- లక్ష్మి దంపతులు మంత్రి శ్రీధర్‌బాబు, సాక్షి దినపత్రికకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

నేడు గార్లలో జాతీయజెండా ఆవిష్కరణ

● దసరా రోజున జెండా ఆవిష్కరణ ఇక్కడ ప్రత్యేకత
● నైజాం కాలం నుంచి కొనసాగుతున్న ఆనవాయితీ

గార్ల: జాతీయతా భావాన్ని, దేశభక్తిని మననం చేసుకుంటూ అందుకు చిహ్నంగా దసరా పండుగ రోజు మానుకోట జిల్లా గార్ల మండల కేంద్రంలో జాతీయ జెండాను ఆవిష్కరించడం ఆనవాయితీగా వస్తుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అవతరించిన అనంతరం గార్ల మున్సిపాలిటీకి చైర్మన్‌గా కాంగ్రెస్ పార్టీ నేత మాటేడి కిషన్‌రావు దసరా పండుగ రోజు కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరించారు. దీంతో కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీల మధ్య ఘర్షణలు జరిగాయి. గార్ల మున్సిపాలిటీ కమ్యూనిస్టు పార్టీ కౌన్సిలర్లు హైకోర్టును ఆశ్రయించారు. ఇరువర్గాల వాదనలు విన్న హైకోర్టు దేశభక్తికి చిహ్నంగా పార్టీలకు అతీతంగా దసరా రోజు జాతీయ జెండాను ఎగురవెయ్యాలని తీర్పు ఇచ్చింది. దీంతో 1958లో నాటి మున్సిపల్ చైర్మన్ మాటేడి కిషన్‌రావు జాతీయజెండాను ఎగురవేశారు. నాటినుంచి దసరా రోజు జాతీయజెండాను గార్ల వీధుల్లో మేళతాళాలతో పంచాయతీ పాలకవర్గం, స్థానిక ప్రముఖులతో కలిసి ఊరేగించి మసీదు సెంటర్లోని గద్దెపై సర్పంచ్ జాతీయజెండాను ఎగురవేస్తారు. ఈ ఏడాది సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో గార్ల మేజర్ గ్రామ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ ఎంపీడీఓ మంగమ్మ నేడు జాతీయజెండా ఆవిష్కరిస్తారని పంచాయతీ కార్యదర్శి కిషన్ వెల్లడించారు.

